## కథ

# బాహ్మలపెళ్లి

**'ఇల్లు కట్టి చూడు...పెళ్లి చేసి చూడు' అన్నారు. అట్టే కష్టం తెలీకుండా నా కలలపంటలాంటి ఇంటిని ఎలాగో కట్టగలిగాను. ఇక అమ్మాయి పెళ్లి కుదిరింది.**

వియ్యాలవారు చిరపరిచితులు. ఇరుగూ పొరుగూ అవటంతో మా మంచిచెడ్డలూ, లోటుపాట్లూ వాళ్లకీ, వాళ్లవి మాకూ బాగానే తెలుసు.

పెళ్లికి కట్నం, లాంఛనాలూ ఏమిమ్మంటారని తాంబూలాల రోజు మా అమ్మాయి కాబోయే అత్తగార్ని అడిగితే...

''వచ్చిన వాళ్లకి ఆదరించి అన్నం పెట్టండి'' అని పెద్దమనసుతో అందనుకునే లోపుగానే...

''ఆడపడుచుల్ని చిన్నబుచ్చకండి...వాళ్లతో పాటుగా అత్తగార్ని.. పెళ్లికూతురు మెడ బోసిపోతే పుట్టింటి వారికే తేలిక. ఆమె అవమానం మీ అవమానం. అది గమనించాలి మీరు.

ఇక మీ అల్లుడికి కట్నమే ఇస్తారో లేక వ్యాపారాలలో వాటాలే ఇస్తారో! లేక మీ హోదాకి తగ్గట్టు మాగాణీ పొలాలే రాసిస్తారో అది మీ ఇష్టం. చివరికి మిగిలిన మా ఇంటాయన్ని మర్చిపోకండి. ఇక వచ్చిన వాళ్లకి వెండిగిన్నెలే పంచిపెడతారో మరి ఏం చేస్తారో మీ ఇష్టం'' అని సుదీర్ఘమైన కోరికల జాబితాని సునాయాసంగా, కర్ర విరక్కుండా పాము చావకుండా లౌక్యంగా, చాకచక్యంగా చెప్పేసింది.

పెళ్లికొడుకు యోగ్యుడూ, ఉత్తముడూ. ఇంకా విదేశాల్లో మంచి కంపెనీలో పనిచేస్తున్నాడు. అమ్మాయి సుఖపడుతుందని పళ్ల బిగువున అన్నిటికీ సరే అనేశాం.

పెళ్లి మా స్వగృహంలో అయితేనే మంచిదని ఇంట్లో జరపటానికే నిర్ణయించుకున్నాం. ఆకాశమంత పందిరి వేయించి, భూదేవంత పీటలు వేయించి పిల్ల పెళ్లి రంగరంగవైభోగంగా జరిపించాలని మా కోరిక.

పెళ్లిహాలూ, కేటరింగ్ వాళ్లు పెట్టే రూపం, రుచీ కోల్పోయిన వేపుడు ముక్కలూ, చిరుగులుపట్టి, వెలిసి కళావిహీనంగా ఉన్న షామ్యానాలూ, నించోని తినే ఎంగిలి కూళ్లూ అంటే నాకు పరమ చికాకు.

చక్కగా పెద్దతనంతో పెద్దక్కా, చిరునవ్వులతో చిన్నక్కా, ముగ్ధంగా ముగ్గురు వదినలూ, పెద్దరికంతో పెద్దమామయ్య సలహాలూ, సంప్రదింపులతో హాజరయ్యే పిన్నిలూ, మేనత్తలూ, అందరూ పెళ్లికి రావాలని నా కోరిక. పూర్తిగా ఎండని సువాసనలు వెదజల్లే తాటాకుల పెళ్లిపందిరి, అరిటాకుల్లో భోజనాలూ... అసలు సిసలైన పెళ్లిని మర్చిపోతున్న జనానికి, ఒక క్రొత్త అనుభవంగా నా కూతురు పెళ్లి జరిపించాలని సంకల్పం.

ఇల్లంతా వెల్ల వేయించటం పూర్తయింది. తలుపులకీ, కిటికీలకీ రంగుల పని పూర్తి కావొస్తోంది. ఇల్లంతా ముగ్గులు దిద్దటంలో బిజీగా ఉన్నారు మా ఆవిడా, పెళ్లికూతురు కాబోతున్న మా అమ్మాయి. పెళ్లి శుభలేఖలు వచ్చేశాయి. వాటిని మెల్లగా పంచటం జరుగుతోంది. పెళ్లి బట్టలు చాలావరకూ కొనేశాం.

బెల్లు మోగింది. వాకిట్లోకి ఎవరో వచ్చినట్టున్నారు.

ఇంలో పిల్ల పెళ్లి బాధ్యత. సంబంధం కుదిరింది. ఇక దాన్ని ఒక ఇంటిదాన్ని చేస్తే...నా బాధ్యత తీరిపోతుంది.

అయ్యా! ఆడపిల్లా, అరటిచెట్టూ ఒకలాంటివే అంటారు. కళ్లముందే ఎదిగిపోతాయి.

పెళ్లి పనులు నత్తనడక నడుస్తున్నాయి.

మంచి రోజు చూసి మా ఆవిడ నలుగురు ముత్తయిదువుల్ని పోగేసి పసుపుకొమ్ములు దంచి పెళ్లిపనులకి శ్రీకారం చుట్టింది. అప్పడాలూ, వడియాలూ పని జరుగుతోంది.

''పెళ్లి పనులు చేయటం నా వంతూ...డబ్బులు సమకూర్చటం మీ వంతూ'' అంటూ కొండంత భారాన్ని నా మీద వేసింది.

ఉన్న అరెకరం బేరం పెట్టేశాను. అది మా అమ్మాయికి ఏమాత్రం ఇష్టం లేదు. ఉన్నా ఆ ఒక్క ఆధారం నా కోసం అమ్మేస్తే పెద్ద వయసులో అమ్మా, మీరూ ఏమయిపోతారోనని ఒకటే గోల

''శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః అమ్మా! ఇది తారణనామ సంవత్సరం. శ్రావణమాసం శుక్ల పక్షం. వర్ష ఋతువు. ఈ రోజు పంచమి. భానువాసరం. పగలు వర్జ్యం లేదు'' అంటూ ఒక బ్రాహ్మణుడు వాకిట్లోకి వచ్చాడు.

వయసు దాదాపు అరవై దాకా ఉండొచ్చు. కొంచెం పెరుగుతున్న తెల్ల గడ్డం, ముఖాన విభూదిరేఖలూ, కుంకుమ బొట్టూ, చేతిలో చిన్న ఖాకీ సంచీ, పేదరికం ప్రతిబింబిస్తున్న నీరగాయ పంచె, ముఖంలో దాచుకున్నా దాగనట్టున్న విద్వత్తూ, ఏ మూలో గత వైభవాన్ని కోల్పోనట్టున్న కళ, మంచి వాక్శుద్ధీ ఉన్నట్టుగా ఉన్నారు.

''అమ్మా! ఆడపిల్ల పెళ్లి జరుపుకుంటున్నాను. మీలాంటి పెద్దింటివాళ్లు కొంచెం పెద్దమనసు చేసుకొని ఈ పేద బాపడికి సాయం చేస్తే...ఈ వయస్సులో నన్ను అంత పెద్ద బాధ్యత నుండీ ఒడ్డున పడేసినవాళ్లవుతారు. ఇక మీ దయ. పెళ్లికి ఇంకెంతో సమయం లేదు. వ్యవధి చాలా తక్కువ. మీ దయా, నా ప్రాప్తం. ఇదిగోండి శుభలేఖ'' అని ఆయన కూతురి పెళ్లి శుభలేఖని మా ఆవిడ చేతికి అందించారు.

శుభలేఖని ఒక క్షణం పరికించి చూసి, నా చేతికందించింది మా ఆవిడ. ఒక్క క్షణం నేనూ చూసి... వాకిట్లోకి వచ్చిన పెద్ద బ్రాహ్మణుడ్ని లోపలికి ఆహ్వానించి కూర్చోపెట్టాను.

అయ్యా! మాది కృష్ణా మండలంలోని కొడాలి గ్రామం. వయస్సు మీద పడుతున్న ఈ తరుచేస్తోంది. అయినా తప్పదు కదా!

పుట్టించిన వాడు కట్టెని చేసేదాకా మార్గం చూపకపోతాడా అని మొండి ధైర్యంతో పొలం బేరం పెట్టేశాను. ఇక పెద్దలు పోతూ వదిలివెళ్లిన ఒక చిన్న పెంకుటిల్లుంది. చలికీ, వానకీ ఈ దేహాన్ని దాచుకోవడానికి.

ఉంటానికెందరో బంధువులున్నారు. కానీ అందరూ అక్కరకి రాని చుట్టాలే!

''మీ మాటమీద అప్పిస్తాం. కానీ ఎలా తీరుస్తారు? ఎక్కడి నుండీ తీరుస్తారు? అని ప్రశ్నిస్తున్నారు.

వాళ్ల ప్రశ్నలకి నా దగ్గర జవాబు లేదు.

ఇలాంటి క్లిష్టకాలంలో వేరే అవకాశం లేక మీలాంటి నలుగుర్ని పెద్ద మనసు చేసుకొని సహాయం చేయమని యాచిస్తున్నాను'' అన్నారు ఆయన.


ఆయన మాటల్ని శ్రద్ధగా ఆలకిస్తున్నాం. నేనూ, మా ఆవిడా, మా అమ్మాయీ.

ఇప్పుడే వస్తానని ఆయనకి చెప్పి లోపలికెళ్లాను. నా వెనకాలే నన్నునుసరించింది మా ఆవిడ.

వాకిట్లోకొచ్చిన పెద్ద బ్రాహ్మణుడ్ని చిన్నబుచ్చకూడదనే నిర్ణయానికొచ్చి.

ఒక పళ్లెంలో ఒక చీరా, ఆయనకి బట్టలూ, వెయ్యి నూట పదహార్లూ పెట్టి ఆయనకందించారు.

అయ్యా! మా అమ్మాయి పెళ్లి ఈ మాసంలోనే ఉంది. మీలాంటి పెద్దలు తప్పక రావాలి.



కాకపోతే..

మీ అమ్మాయి పెళ్లీ, మా అమ్మాయి పెళ్లీ ఒకే రోజు, ఒకే ముహూర్తానికి, ఒకే వేదికమీద, ఒకరితోనే జరగబోతున్నాయ్. అదేం చిత్రమో కానీ మీ అమ్మాయి పేరూ, మా అమ్మాయి పేరూ కూడా ఒకటే. కావాలంటే శుభలేఖ చూడండని ఆయన చేతికి మా అమ్మాయి పెళ్లికార్డు అందించా. శుభలేఖని చూస్తూనే ఆయన స్థాణువయ్యాడు. నుంచున్నవాడే కుర్చీలో కూలబడ్డాడు. ముఖంలో కత్తివాటుకు నెత్తురు చుక్క లేదు. శరీరం కొద్దిగా కంపించసాగింది.

ఆయనతో ఇలా అన్నాను.

''అయ్యా! మీరు పెద్దలు. బ్రాహ్మణులు. మా పిల్ల పెళ్లి శుభలేఖని పట్టుకొని ఇంటింటికీ తిరుగుతూ, మీ పిల్ల పెళ్లని చెప్పుకొని డబ్బులు యాచించటం ఈ వయసులో మీకు శోభనిస్తుందా?

తెలిసిన నలుగురూ ఈ శుభలేఖని చూస్తే మా పరువూ, మా పిల్ల మర్యాదా ఏం కావాలి? అయినా మా పిల్ల శుభలేఖ మీ చేతికెలా వచ్చింది? అని కోపంతో గుండె మండిపోతున్నా...అంత పెద్ద బ్రాహ్మణున్ని ఇంతకు మించి అనలేకపోయాను.

పెద్దమనిషి నోట మాట రావటం లేదు. రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు. కనుకొలకల్లో రెండు కన్నీటిబొట్లు నిల్చాయి.

మెల్లిగా గొంతు పెగుల్చుకొని అన్నారు.

అయ్యా! ''ఉదర పోషనార్థం బహుకృత వేషం'' అన్నారు. నేను మోసగాడ్ని కాదు. నా బండలయిన బతుకు కథ ఒక్క క్షణం వినండి.

శార్థం మంత్రాలు చదివి కాలం ఈడుద్దామన్నా సెల్‌ఫోన్ల మీదే కృతువుల్ని ఫిక్స్ చేస్తున్నారు. కర్మలు పెట్టించి పొట్టపోసుకుందామన్నా, చివరికి శని దానం తీసుకొని బ్రతుకీడుద్దామన్నా... దానికీ పోటీనే అని ఒక్క క్షణం ఆగారు.

ఇక్కడ వాక్కుకీ, మంత్రానికీ ప్రాధాన్యత లేదయ్యా!

మల్లాది రవిశంకర్

నేనూ శాస్త్రం చదివాను. పెళ్లి మంత్రాలని శాస్త్రోక్తంగా చేయించే ఉద్దండుడిగా మా చుట్టుపక్కల గ్రామాల్లో పేరుండేది. ఈ భావన్నారాయణ శాస్త్రి ప్రవర చదివితే... అటు ఏడు తరాలూ... ఇటు ఏడు తరాలునే కాకుండా పెళ్లికొచ్చిన ప్రతి ఒక్కరూ మైమరచేవారు. సంపాదించిన సొమ్ములూ, కంకణాలూ కాలగర్భంలో కలిసిపోయాయి. వయసు పెరుగుతున్నకొద్దీ శక్తి సన్నగిల్లుతోంది. కారణాంతరాల వల్ల పుట్టిపెరిగిన ఊరు వదలాల్సి వచ్చింది.

కొత్త ఊరు. పరిచయం లేని మనుషులూ...క్రతువులు జరగాలి కానీ మంత్రానికి ప్రాధాన్యత నివ్వని తొందర బ్రతుకులు.

ఈ ఊరి నిబంధనల ప్రకారం మంత్రం చెప్పాలంటే కులసంఘంలో పేరు నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత వచ్చిన దక్షణలో సగం దాకా సంఘానికి ధారాదత్తం చేయాలి.

కులవృత్తిని వ్యాపారంగా చేస్తుంటే తట్టుకోలేక దానికి స్వస్తి చెప్పాను.

ఇక తెల్లారటానికీ, ప్రొద్దొకటానికీ ఎవరి నిమిత్తం లేనట్టుగానే, ఈ జానెడు పొట్ట పెడుతున్న క్షుద్బాధని భరించలేక గుడిలో దేవుడి పేర ఇచ్చిన ఈ తొలి శుభలేఖల్ని అడ్డం పెట్టుకొని ఈ పాపిష్టి బ్రతుకు బ్రతుకుతున్నాను.

ప్రతీరోజూ ఆత్మపరిశీలన, ఆత్మ విమర్శా చేసుకుంటాను. నేను చేస్తున్న పనికి నన్ను నేనే శపించుకుంటాను. అయినా బ్రతుకు తెరువు కోసం ఈ పాపిష్టి పని చేస్తూనే ఉన్నాను.

మా ఊళ్లోనూ, చుట్టుపక్కల గ్రామాల్లో నేను చేయించిన పెళ్లిమీదా, చదివే మంత్రం మీదా ఎనలేని గురి. నేను పెళ్లి చేయిస్తే ఆ జంట కలకాలం చల్లగా ఉంటారని నలుగురూ అనుకుంటారు.

పెళ్లి మంత్రాల మీద ఉన్న ఎనలేని నమ్మకంతోనూ, నేను చేస్తున్న ఈ పాడుపనికి కొంత ప్రాయశ్చిత్తం కోసం..అదే ముహూర్తానికి రెండు బొమ్మల్ని పెట్టి నేనే యాగ్గికుడినై, నేనే కన్యాదానినై.. నా కూతురని చెప్పుకునే పిల్లనీ, ఆ పిల్లాడినీ నా ఎదుటి బొమ్మల్లో ఊహించుకొని బొమ్మల పెళ్లి క్రమం తప్పకుండా జరిపిస్తాను. నిజం పెళ్లిలో ఏ కొంచెం మంత్రహీనం, క్రియాహీనం జరిగినా, నేను చేసే ఈ బొమ్మలపెళ్లిలో ఎటువంటి లోపం రాకుండా చూస్తాను.

ఎందుకంటే మంత్రాలకే మహిమ నేది ఉంటే... నా కూతురూ, అల్లుడూ అని చెప్పుకునే ఆ నవజంట చిలకా, గోరింకల్లాగా, సుఖసంతోషాలతో, భోగభాగ్యాలతో నూరేళ్లు నిలవాలని నిండు మనసుతో ఆశిస్తూ ఆ బొమ్మల పెళ్లి చేస్తున్నాను.

నేను చేస్తున్నానని చెపుతున్న ఈ బొమ్మలపెళ్లి నా పాపాన్ని పంకిలం చేయకపోవచ్చు. కానీ ఒక చిన్న తృప్తి కోసం.

ఈరోజు...ఈ క్షణం...ఈ భావన్నారాయణ శాస్త్రి. .. మీ ముందు దోషిగా పట్టుబడ్డాడు. మరి పోలీసులకి పట్టించినా...ఏ శిక్ష విధించినా... నేను సంసిద్ధం'' అని లేచి నిలబడ్డారు. చేతులు ముందుకి జాపి లొంగిపోయానని సంకేతంగా.

ఆయన మాటల్లో నిజాయితీ కొట్టొచ్చినట్టుగా అగుపిస్తోంది. కులవృత్తిని వ్యాపారంగా చేస్తున్నారని ఆయన మాటల్లోని పరమసత్యం మాకూ విదితమే.

పొద్దున్న లేచిన దగ్గర నుండీ, పడుకునే దాకా జీవిత గమనంలో ముందుదిగా, వెనుకదిగా, కుడి ఎడమ దగాదగా. ఈ దగా జీవితంలో భాగం అన్నట్టు అలవాటు పడ్డ మనుషులకి ఈ భావన్నారాయణశాస్త్రి గారి దగా ఎంత మాత్రం?

ఈయన దగా మాటకోసం!

మరి ఆయనకేమి శిక్ష విధిస్తాం?

అన్నీ ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాను.

అయ్యా! మీరు చెపుతున్న మాటల్ని నిజం అని నమ్మాలంటే మీరొక పనిచేయాలి.

మా అమ్మాయి పెళ్లికి వశిష్టులవారు మీరే అయి పెళ్లి జరిపించాలి. ఎక్కడా మంత్రహీనం, క్రియాహీనం జరగకూడదు. మీరు పెళ్లి బాగా చేయిస్తే...

మా కంపెనీలన్నిట్లోనూ శుక్రవారం లక్ష్మిపూజ మీరే జరిపించే అవకాశం మీకిస్తాను. మీ అర్హతలకి తగ్గట్టుగా, మా శక్తికి మించనట్టూ జీతం మీకిస్తాను.

ఇక మీకు మంత్రం రాదని నిర్ధారణ అయితే దయచేసి మీ ముఖం నాకు చూపించద్దు అన్నాను.

నా నిర్ణయాన్ని విని భావన్నారాయణశాస్త్రిగారు కదిలిపోయారు. నా కాళ్లు పట్టుకోబోయారు. నిరాకరించాను.

''అయ్యా! నా విద్వత్తుకు మీరు పెడుతున్న పరీక్షలో తప్పక పాల్గొంటాను. ఇది పరీక్ష కాదయ్యా! నిజంగా నాది అని నలుగురికీ చెప్పుకున్న నా కూతురి పెళ్లి నా మంత్రంతోనే జరిపించే అవకాశం మీరు నాకిస్తున్నారు. ఇది నేను ఇంత కాలం జరుపుతున్న బొమ్మల పెళ్లి కాదయ్యా! అష్టదిక్పాలకుల సాక్షిగా, సప్తఋషుల సాక్షిగా, మహాసాధ్వి అరుంధతి సాక్షిగా జరగనున్న నిజమైన పెళ్లయ్యా అన్నారు ఉద్వేకంగా.

మేమిచ్చిన బట్టలూ, డబ్బులూ స్వాభిమానంతో నిరాకరించారు.

మళ్లీ ముహూర్తం ముందు రోజు కనిపిస్తానని చెప్పి భావన్నారాయణునిలాగా ముందుకు కదిలి వెడుతున్న యాగ్గీకుండు భావన్నారాయణశాస్త్రిగార్ని చూస్తూ ఉండిపోయాం మేమంతా.



## ఇమేజ్ ఇంతింతై..

**'ఇంతింతై వటుడింతై..' అన్నట్టుగా రతీ అగ్నిహోత్రి కెరీర్ గ్రాఫ్ ఇప్పుడు హైలెవెల్‌లో సాగుతోంది. ఇప్పుడామె స్మార్ట్‌గా తయారవ్వడమే కాక మంచి ఇమేజ్‌ని సొంతం చేసుకుంది. బరువు తగ్గడమే కాదు డైటింగ్ చేస్తూ, మంచి ఫిజిక్‌ని పొందింది. ఓ టీవీ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్న రతీ ఇతర తారలకంటే ఎక్కువ రెమ్యూనరేషన్‌ని డిమాండ్ చేసే స్థాయికి ఎదిగింది. అన్నట్టు ఈ ప్రోగ్రాం మంచి రేటింగ్ పొందింది.**